ప్రజాశక్తి
శుక్రవారం 25 జులై 2025
5
పార్వతీపురం మన్యం

గుండె పోటుతో ఉపాధ్యాయుడు మృతి

సాలూరు రూరల్ : మండలంలోని బర్నికవలస గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడివగా పనిచేస్తున్న కోట బాలకృష్ణ (53) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం పెద్దపదం పంచాయతీ పాలికవలస. గురువారం ఉదయం బాలకృష్ణ పాఠశాలకు వెళ్లే ముందు షాప్ నుంచి టిఫిన్ ఇంటికి తెచ్చుకొని తినేందుకు సన్నద్ధం కాగా, హఠాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే చనిపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కూడా ఉపాధ్యాయురాలే. బాలకృష్ణ మృతి పట్ల ఎంఇఒ ఎన్.వెంకటరావు, ఉపాధ్యాయులు, సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

జిపిఎస్‌లను వేధిస్తున్న టీచర్ల కొరత

- రోజుకో పాఠశాల నుంచి ఉపాధ్యాయుడు
- గందరగోళంలో విద్యార్థులు
- మెగా డిఎస్‌సి నియామకాలతోనైనా సమస్య పరిష్కారమయ్యేనా?

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గిరిజన ప్రాంతాల్లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జిపిఎస్)లను ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ఇటీవల కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఉపాధ్యాయుల కోసం విద్యార్థులు ఎదురు చూడకూడదన్నారు. అయితే మండలంలో మాత్రం విద్యార్థులు ఉపాధ్యాయుల కోసం ఎదురుచూస్తునే ఉన్నారు. జిపిఎస్ పాఠశాలలకు ఉపాధ్యాయుల్లేకపోవడంతో ఆశ్రమ పాఠశాల నుంచి రోజుకొక ఉపాధ్యాయులను ఆ బడులకు పంపడంతో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు.

మండలంలోని మారుమూల గ్రామాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిపిఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. గిరిజన ప్రాంతంలో 39 జిపిఎస్ పాఠశాలలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల పరిధిలో 14 జిపిఎస్ స్కూళ్లు, పెదఖేర్జల ఆశ్రమం పాఠశాల పరిధిలో 15, కెమిశీల ఆశ్రమ పాఠశాల పరిధిలో 10 జిపిఎస్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలకు గత కొన్నేళ్లుగా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఇటీవల కొమరాడ మండలంలోని జిపిఎస్ పాఠశాలకు ఉపాధ్యాయులు లేకపోవడంతో అక్కడ గిరిజన విద్యార్థులకు చదువు చెప్పేవారు లేక కొండలు, గుట్టల్లో తిరుగుతున్న విషయం సోషల్ మీడియా ద్వారా బయటకు రావడంతో అధికారులు స్పందించి డిప్యుటేషన్‌పై క్లస్టర్ పాయింట్లలో ఉన్న ఉపాధ్యాయులను పంపుతున్నారు. గత కొద్ది రోజులుగా మండలంలోని దేరుపాడు, గాజులగూడా, కొన, వనబది, కుస్తూరు మొదలగు జిపిఎస్ పాఠశాలకు ఉపాధ్యాయులు లేకపోయిన విషయం పత్రికల్లో రావడంతో అధికారులు స్పందించి మరుసటి రోజు నుంచి ఉపాధ్యాయులను పంపిస్తున్నారు. కెమిశీల ఆశ్రమ పాఠశాలలో 10 జిపిఎస్ పాఠశాలలకు నలుగురు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆశ్రమ పాఠశాల నుంచి నలుగురు ఉపాధ్యాయులను ఆ జిపిఎస్ స్కూల్‌కు పంపిస్తున్నారు. రోజూ ఒకే ఉపాధ్యాయుడ్ని ఆ పాఠశాల పంపిస్తే విద్యార్థులు చదువు చెప్పేందుకు అవకాశం ఉండేది. కానీ రోజుకొక టీచర్ను పంపించడంతో విద్యార్థులకు అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారు. మెగా డిఎస్‌సి ద్వారా ఖాళీలను భర్తీ చేస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పటికీ చర్యలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. డిఎస్‌సిని పక్కన పెడితే స్థానికంగా ఉన్నత చదువులు చదువుకొని ఖాళీగా ఉన్న గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశం ఇస్తే తక్కువ వేతనాలతో జిపిఎస్ పాఠశాలలో చదువు చెప్పేందుకు అవకాశం ఉంటుందని గిరిజన సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిపిఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించి గిరిజన విద్యార్థులకు చదువు అందించేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

టీచర్ కోసం నిరీక్షిస్తున్న కుస్తూరులోని జిపిఎస్ పా ఠశాల చిన్నారులు

ఉపాధ్యాయుడు లేకపోవడంతో బోసిపోయిన కోన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి

- వామపక్షాలు, ప్రజా సంఘాలు పిలుపు
- 5న కలెక్టరేట్ వద్ద ధర్నా
- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అడ్డగోలుగా బిగిస్తున్న అదానీ స్మార్ట్ మీటర్లను ప్రజలంతా అడ్డుకోవాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ప్రజలకు పిలుపునిచ్చాయి. గురువారం స్థానిక సుందరయ్యభవనంలో స్మార్ట్ మీటర్ల అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించొద్దని డిమాండ్ చేశారు. ఈ మేరకు జులై 31 నుంచి ఆగస్టు 4 వరకు ప్రచార కార్యక్రమాలు, 5న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాలని తీర్మానించారు. ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్ల వల్ల భారీగా విద్యుత్ బిల్లులు రావడం దుర్మార్గమన్నారు. వెంటనే విద్యుత్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. వేసిన విద్యుత్ బిల్లును రద్దు చేయాలని, స్మార్ట్ మేటర్లను తొలగించాలని గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ మీటర్లను రద్దు చేస్తామని, విద్యుత్ బిల్లులు పెంచబోమని హామీ, స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని పిలుపునిచ్చిన నారా లోకేష్ నేడు విద్యుత్ బిల్లులను భారీగా పెంచడం అన్యాయమన్నారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపే స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు శ్రీను నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు పోల ఈశ్వరరావు, లిబరేషన్ జిల్లా నాయకులు పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలకు రంజిత్ కుమార్, సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు బి.సూరిబాబు, రెడ్డి శ్రీదేవి, పి.రాజశేఖర్, డేవిడ్, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

గిరిజనులకు జీవనోపాధి కల్పిస్తాం

- మూడు నెలల్లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి
- పిఎం జన్మాన్ గృహ నిర్మాణాలు, భద్రగిరి సిహెచ్‌సి పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

గిరిజనుల జీవనోపాధికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీలో గురువారం పర్యటించారు. ముందుగా ఇరిడి పంచాయతీ కన్నయ్యగూడ పిటిజి గిరిజన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పిఎం జన్మన్ గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయి, మేస్త్రీల దొరుకుతున్నారా లేదా బిల్లులు మంజూరైనదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. మూడు నెలల్లోగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయకపోతే బిల్లులు నిలిపి వేస్తామని అన్నారు. సాధ్యమైనంత త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. విడివికె గ్రూపు సభ్యులకు ఉపాధి కోసం పిండి మిల్లు, ఇస్తరాకుల తయారీ వంటి చిన్న తరహా పరిశ్రమల యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. మహిళా సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకుంటే యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. అవసరం అనుకుంటే గ్రామంలో కమ్యూనిటీ భవనం నిర్మిస్తామన్నారు. తమ గ్రామానికి రక్షిత మంచినీటి ట్యాంక్ మంజూరు చేయాలని గిరిజనుల కోరారు. రూ.17 లక్షలతో వాటర్ ట్యాంక్, బోరు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ నాగేశ్వరరావు కలెక్టర్‌కు తెలిపారు. అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులతో ముచ్చటించారు. వారు మాట్లాడిన భాషలోనే ఆటపాటలతో విద్యాబోధన చేపట్టాలన్నారు. గర్భిణీలు, హైరిస్క్ గర్భిణీలను గుర్తించి పౌష్టికాహారం అందించాలన్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పెచ్చులు ఊడుతుందని గ్రామస్తులు కలెక్టర్ వివరించారు. అనంతరం భద్రగిరి పిటిజి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సిక్ రూమ్ పరిశీలించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. రోజువారి ఓపి వివరాలు, అందుతున్న సేవలు పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. కొత్తగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రిని సందర్శించి పనులను పరిశీలించారు. డ్రైనేజీ, రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. అదనపు భవనం నిర్మాణానికి స్థలం కావాలని ప్రిన్సిపల్ శ్రీవరం కలెక్టర్‌ను కోరారు. స్థలం ఇచ్చేందుకు దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. అనంతరం కురుపాం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు.

కన్నయ్యగూడలో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జిల్లాలో పిఎం జన్మన్ ఇళ్లు130 పూర్తి

మన్యం జిల్లాలోని పిఎం జన్మన్ కార్యక్రమంలో భాగంగా 5000 ఇళ్లు మంజూరవ్వగా 1600 ఇళ్లు వివిధ దశల్లో ఉండగా, 130 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.39,000 చెల్లిస్తుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లు మంజూరైనా జియో ట్యాగింగ్ సరిగ్గా జరగకపోవడంతో ఆన్లైన్లో మంజూరైనట్లు కనిపించడం లేదన్నారు. అంగన్వాడీ భవనాల మరమ్మతులకు సమీపంలో ఉన్న పాఠశాలల ఫండ్ నుంచి రూ.5వేలు చొప్పున ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంచాల కొరత ఉందన్నారు. సమీపంలో ఉన్న 50 పడకల ఆసుపత్రి భవనం పూర్తి అయితే రోగులకు మెరుగైన సేవలందుతాయన్నారు. రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాగావళిలో 4000 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందన్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా 3, 4, 5 తరగతుల పిల్లలను 100 మీటర్లు దూరంలో ఉన్న పాఠశాలల్లో విలీనం చేసినట్టు తెలిపారు. 1,2 తరగతులు ఉంటాయి తప్ప ఆ పాఠశాలలను తొలగించే ప్రసక్తే లేదన్నారు. రెండో విడత నాడు నేడులో నిలిచిపోయిన పాఠశాలల భవనాలు పూర్తి చేసినందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకాలు లేవని అడిగిన ప్రశ్నకు సమాధానం సచివాలయంలో ఉన్న ఎఎన్ఎంలు విద్యార్థులకు ప్రతిరోజు వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

కార్యక్రమంలో ఐటిడిఎ గిరిజన సంక్షేమశాఖ డిడి కృష్ణవేణి, ఐసిడిఎస్ పిడి కనకదుర్గ, హౌసింగ్ పీడీ ధర్మచంద్రా రెడ్డి, ఎంపిడిఒలు త్రివిక్రమరావు, ఉమామహేశ్వరి, తహశీల్దార్ శేఖర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇ పార్కు పనులు ఆపకపోతే ఆందోళన ఉధృతం

- గిరిజనులు స్పష్టీకరణ
- రెవెన్యూ కార్యాలయంలో అధికారుల చర్చలు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని కాకర్లవలస, కారేడువలస గ్రామాల్లో జరుగుతున్న ఎంఎస్ఎంఇ పార్కు పనులు ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని గిరిజనులు హెచ్చరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం ప్రజాప్రతినిదులు, వామపక్ష నాయకులు, గిరిజనులతో తహశీల్దార్ అజురఫీ జాన్, ఎపిఐఐసి అధికారులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 2015లో ఎపిఐఐసికి సుమారు 187 ఎకరాలు ప్రభుత్వం కేటాయించిందని, ఆ భూముల్లోనే గిరిజనులు పంటలు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. అయితే ఒక సంస్థకు కేటాయించిన భూములను గిరిజనులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని, అప్పట్లో ఈ భూమి కోసం ఎపిఐఐసి సుమారు రూ.7 కోట్లు చెల్లించిందని తెలిపారు. అంతేకాకుండా కాకర్లవలస, కారేడువలస గిరిజనులకు 2021లో రిజర్వు ఫారెస్టుకు సంబంధించి భూములు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. వాటిని సాగు చేయకుండా ఎపిఐఐసికి కేటాయించిన భూముల్లో పంటలు సాగుచేయడం సరి కాదన్నారు. గిరిజనులు స్పందిస్తూ ఎపిఐఐసికి ఆ భూములను కేటాయించక ముందే తాము ఈ బంజరు భూములను సాగుచేసుకుంటున్నామని, దానిపై వేలాది రూపాయల మదుపులు పెట్టి పంటలు వేసుకొని జీవనం సాగిస్తున్నామని, నిరుపేద గిరిజనులమైన తమకు ఆ భూమిపై పూర్తి హక్కులు ఉన్నాయని తౌడమ్మ అనే గిరిజన మహిళ వాదించారు. తమకు తెలియకుండా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అప్పట్లో రెవెన్యూ అధికారులు ఎపిఐఐసికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఆ భూములను తాము వదులుకునే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. సుమారు 60 కుటుంబాలు ఆ భూములను తాతముత్తాతల నుంచి సాగుచేసుకుంటున్నామని, అటువంటి భూములను తమ నుంచి స్వాధీనం చేసుకోవడానికి అధికారులు చర్యలు తీసుకుంటే ఆత్మహత్యలే శరణ్యమని తెలిపారు. ఇప్పటికే తాము సాగుచేసుకుంటున్న భూమిలో జెసిబి సాయంతో మొక్కలను ధ్వంసం చేశారని తెలిపారు. సిపిఎం నాయకులు బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ జెసిబిలతో తొలగించిన భూములకు నష్టపరిహారం చెల్లించడమే కాకుండా ప్రస్తుతం గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. సర్పంచ్ మజ్జి రాంబాబు మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నిర్వాకం వలన గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, సాగుచేసుకుంటున్న భూముల లబ్దిదారులకు నోటీసులు ఇవ్వకుండా ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసామని, అప్పటివరకు ఈ ఎంఎస్ఎంఇ పార్కు పనులు నిలుపుదల చేయాలని కోరారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎఎస్‌పి అంకిత సురానా

సైబర్ నేరాలపై అప్రమత్తం : ఎఎస్‌పి

ప్రజాశక్తి - సాలూరురూరల్

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని మెసులుకోవాలని ఎఎస్‌పి అంకిత సురానా తెలిపారు. పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సును పట్టణ సిఐ బి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎఎస్‌పి మాట్లాడుతూ ఆధునిక కంప్యూటర్ యుగంలో మనిషి ఎంతగా అభివృద్ధి చెందుతున్నా దానికి తగ్గట్టుగానే నేరాలు కూడా అధికమై వివిధ రూపాల్లో వివిధ రకాలైన వ్యక్తులు వివిధ రకాలైన ప్రాంతాల నుంచి మోసాలకు పాల్పడుతూ ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. ఇటువంటి మోసాలపై ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఈగల్ క్లబ్స్ విధివిధానాలను తెలియజేస్తూ, ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనేలా పోలీసుల సేవలను ఉపయోగించుకొనేలా ఉండాలని తెలిపారు. మైనర్లు ద్విచక్ర వాహనాలను ఎక్కువగా వాడడంతో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించి నడుచుకోవాలని, ర్యాగింగ్, పోలీస్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆమె తెలిపారు.

కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పి4 సర్వే వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పి4కి సంబంధించిన సర్వేను వేగవంతం చేస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కు వివరించారు. పి4, ప్రజా సానుకూల దృక్పథం, ఆర్టీజీఎస్ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బంగారు కుటుంబాల్లో దాదాపు 50 శాతం వరకు సర్వే పూర్తయిందన్నారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని, వీటిని మరింత వేగవంతం చేస్తున్నామని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, డిఆర్ఒ కె.హేమలత, డ్వామా, డిఆర్డిఏ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని మనుమకొండలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కొండపల్లి రవీంద్ర గురువారం సందర్శించారు. వసతిగృహంలో ఉన్న విద్యార్థులకు ఎత్తు, బరువు, హెమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. వసతి గృహంలో తరగతి గదులు, వంటగది, సిక్ రూములను పరిశీలించారు. పిల్లలకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. వంటగదిలో హైజిని కండిషన్లో ఆహార పదార్థాలు వండాలని వైద్యులు సూచించారు. పిల్లల వ్యక్తిగత శుభ్రతతో పాటు, హ్యాండ్ వాష్ టెక్నిక్స్ పాటించాలని, వర్షాకాలంలో వేడి నీళ్లు తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సిఐటియు అఖిల భారత జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి బి వి రమణ పిలుపునిచ్చారు. గురువారం గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన భవనంలో సిఐటియు మండల కన్వీనర్ కె.గౌరీశ్వరరావు అధ్యక్షతన జరిగిన సిఐటియు అనుబంధ సంఘాలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం అనేక సమస్యలు ఎదుర్కొంటుందని, వీటిపై పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు డిసెంబర్ 31, జనవరి 1 నుండి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. ఈ మహాసభలకు ముందుగా రాష్ట్ర, జిల్లా మహాసభలు నిర్వహించనున్నామని తెలిపారు. అందులో భాగంగా సెప్టెంబరు 13, 14తేదీల్లో పాలకొండలో జిల్లా మహాసభలు జరుగుతాయని, వీటిని జిల్లాలోని కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సత్యవతి, కస్తూరి, నిర్మల, ఆర్.ఎందుదొర, కంటూ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : సిఐటియు అఖిలభారత, జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. స్థానిక పిహెచ్‌సి ఆవరణలో శ్రామిక మహిళ నాయకులు వి.రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన సిఐటియు అనుబంధ రంగాల కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 31, జనవరి 1 నుంచి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను, సెప్టెంబర్ 13,14న పాలకొండలో జరుగు జిల్లా మహాసభలను జిల్లాలోని కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ ప్రజాసంఘాల నాయకులు రాము, వి.శాంతి కుమారి, జి.జ్యోతి, గౌరీశంకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, నాయకులు

పోరాట యోధుడు అచ్యుతానందన్‌కు ప్రజాసంఘాలు ఘన నివాళి

కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రజా ఉద్యమ నేత విఎస్ అచ్యుతానందన్‌కు గుమ్మలక్ష్మీపురంలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన, పోరాటాలను నిర్మించిన ఘన చరిత్ర కలిగిన నేత విఎస్ అని కొనియాడారు. మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన ఆదర్శ కామ్రేడ్‌కు ఘనమైన నివాళి అర్పించడమంటే ఆయన ఆశయాల సాధనకు కృషి చేయడమేనని ప్రజలకు పిలుపునిచ్చారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డి రవీంద్ర

నగర పంచాయతీలో ఆర్‌డి పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో మున్సిపల్ ఆర్‌డి రవీంద్ర గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పలు భవనాలను పరిశీలించి కొలతలను కొలిపించారు. వ్యాపార సముదాయాలను, భారీ భవనాలను కూడా పరిశీలించారు. విధినిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. భవనాలు అనుమతులకు కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. ఆర్‌డి వెంట స్థానిక నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని ఎంఇఒ-1 డి.గౌరునాయుడు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని సంతనర్సిపురం మోడల్ ప్రైమరీ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, అందుబాటులో తాగునీరు ఉంచాలని అన్నారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలు ఏ విధంగా ఉన్నాయో విద్యార్థుల నుంచి రాబెట్టారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు వి.లక్ష్మనాయుడు, ఎన్.మానస, ఎం.పైడిరాజు, జి.ప్రసాద్, ఎ.దివ్య, సిఆర్‌ఎం టిఎం దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

చెరువుగట్లపై మొక్కలు పెంపకానికి సిద్ధం

ప్రజాశక్తి - సీతానగరం

చెరువు గట్లపై మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నామని ఎపిఒ పిబాలకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలను సిద్ధం చేశారు. 9500 కొబ్బరి మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వీటిని ఆయా గ్రామాలకు ఇవ్వనున్నట్టు తెలిపారు. మొక్కలు పెంపకం చేసేందుకు రైతులు ఇప్పటికే కొన్ని పేర్లు ఇచ్చారని, వీరిందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్‌ఎల్‌ఎన్ ప్రసాద్, ఇసి సోమేశ్వరరావు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు

ఎగువదారలో భాషా వాలంటీరుతో మాట్లాడుతున్న ఎపిఒ చినబాబు

పాఠశాల భవనం మంజూరుకు కృషి

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని జిపిఎస్ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలకు పక్కా భవనాలు మంజూరుకు కృషి చేస్తామని ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఎగువదారబ జిపిఎస్ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా భవనాల మంజూరుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, అవి త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సిఆర్‌టి ఉపాధ్యాయుడు ఎటువంటి అనుమతులు లేకుండా గైర్హాజరు కావడం గమనించి ఆయనకు మెమో జారీ చేసేందుకు ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాషా వాలంటీరు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎట్టకేలకు గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎట్టకేలకు పట్టణంలోని బైపాస్ రోడ్‌పై ఏర్పడిన గుంతలను ఆర్‌అండ్‌బి అధికారులు గురువారం పూడ్చివేసే పనులను మొదలుపెట్టారు. బైపాస్ రోడ్డులో ఏర్పడిన గుంతల వల్ల ఆ రహదారిగుండా రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతూ, ఆసుపత్రి పాలవ్వడంతో స్థానికులు సోషల్ మీడియా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఆర్‌అండ్‌బి ఇఇ దృష్టికి తీసుకువెళ్లగా బైపాస్ రోడ్‌లో ఏర్పడిన గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేసేందుకు గురువారం చర్యలు చేపట్టడంతో ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే వాహన చోదకులతో పాటు స్థానికుల హర్షం వ్యక్తం చేశారు.

వైద్య పరికరాలు సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినభోగిలిలో 104 సంచార వైద్య శిబిరాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి పిఎల్ రఘు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు నిర్వహిస్తున్న వైద్య తనిఖీతో పాటు చికిత్సను పరిశీలించారు. జ్వరాలు ప్రబలే అవకాశముండడంతో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు కూడా నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో ఫీవర్ సర్వే పక్కగా చేపట్టి, జ్వర లక్షణాలున్న వారిని త్వరగా గుర్తించాలని స్పష్టం చేశారు. వాహనంలో ఉండే ఇసిజి యంత్రం పనితీరుతో పాటు మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. రోగుల తనిఖీలను ఆన్లైన్లో పొందుపరచాలని, అలాగే దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలు కూడా నెలవారీ సక్రమంగా 104 వాహనాల్లో జరగాలని, అధిక రక్తపోటు మధుమేహం తదితర మందులు రోగులకు సక్రమంగా పూర్తిస్థాయిలో అందాలని అన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న 104 పనితీరు మెరుగుపడాలని సూచించారు. అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీతానగరం పిహెచ్‌సి వైద్యాధికారి డా. ఉషారాణి, వైద్య సిబ్బంది 104 సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి రఘు

సాగు భూములకు పట్టాలివ్వాలని నిరసన

ప్రజాశక్తి - వీరఘట్టం

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, గిరిజన సంఘాల నాయకులు

మండలంలోని చిన్నగోర రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న గిరిజనులకు, పేదలకు డి-పట్టాలు కోరుతూ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సీతారాం మాట్లాడుతూ చిన్నగోర రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 17లో సుమారు వందెకరాల భూమిని గత 40ఏళ్లుగా చినగోర, గోర గిరిజనులు భూమిని సాగు చేసుకుంటూ వరి, పత్తి, మినప తదితర రకాల పంటలు పండించుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అలాగే జియ్యమ్మవలస మండలం గెడ్డసింగపురం, ఏనుగుల గూడ గిరిజనులు గత 15ఏళ్లుగా కొంత భూమిని సాగు చేసుకుంటూ పత్తి, మొక్కజొన్న, జీడి, మామిడి, ఇతర పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈ భూమి మాకే కావాలని సంత నర్సిపురానికి చెందిన కొంతమందిని ప్రజలను రెచ్చగొట్టి గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. ఈ గొడవల్లో ఏనుగులగూడకు చెందిన మూటక లక్ష్మి, గడసింగుపురానికి చెందిన గరుగుబిల్లి దమయంతి తీవ్రంగా గాయపడ్డారన్నారు. కావున తక్షణమే రెవెన్యూ అధికారులు కలుగజేసుకొని చిన్న గోర రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న వంద ఎకరాల గిరిజనులకు, పేదలకు డి పట్టాలు ఇచ్చి వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజనులపై దాడి చేసిన వారిని శిక్షించాలని, గిరిజనులకు రక్షణ కల్పించాలని, సాగు చేసిన భూములకు డి-పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు ఎఎస్ కామేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఎన్.సింహాచలం, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పెదరావు భాస్కరరావు, జిల్లా నాయకులు గ్రంధి సూరి, ఆరిక రమణయ్య తదితర గిరిజనులు పాల్గొన్నారు.

హాస్టల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హాస్టల్‌కు మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆ హాస్టల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఆరిక.గంగారావు మాట్లాడుతూ సుమారు 400 మంది విద్యార్థులు ఈ హాస్టల్‌లో౦౦౦౦ ఉన్నారని, అయితే వీరికి సరిపడా మరుగుదొడ్లు, భోజనశాల, డిగ్రీ విద్యార్థులకు సరిపడా వసతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే బురద నీరంతా నిలిచి హాస్టల్ ఆవరణమంతా చెరువులా మారిపోతుందని, దీంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని అన్నారు. ఇంతమంది గిరిజన విద్యార్థులు చదువుతున్న ఈ హాస్టల్‌లో కనీసం ఎఎన్ఎంను లేకపోవడం బాధాకరమని చెప్పారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, రైతులు

'మన గ్రోమోర్' యాజమాన్యం తీరు మారాలి

సిపిఎం ఆధ్వర్యంలో రైతులు నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

రైతులకు సక్రమంగా ఎరువులు ఇవ్వని మన గ్రోమోర్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని, యాజమాన్యం తీరు మారాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరాడలో గల మన గ్రోమోర్ సెంటర్ యాజమాన్యం యూరియా, డిఎపితో పాటు గులుకుల ప్యాకెట్ కొనాలని, లేకపోతే ఎరువులు ఇవ్వనంటూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అలాగే ఎకరాకు ఒక బస్తా చొప్పున ఇవ్వాలల్సి ఉండగా, తనకు కావాల్సిన వారికి ఎక్కువ ఎరువు ఇస్తున్నారన్నారు. కావున అధికారులు స్పందించి మన గోమోర్ సెంటర్ యాజమాన్యం తీరుపైన స్పందించాలని డిమాండ్ చేశారు. నిరసనలో కృష్ణ, ఎస్.గంగరాజు, బలరాం, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - కొమరాడ

విద్యార్థులు విధిగా నేత్ర పరీక్షలు చేసుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి పర్యవేక్షణలో మండలంలోని కెమిసీల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు గురువారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య కార్య క్రమంలో భాగంగా జూలై 21 నుంచి అక్టోబర్ 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. దృష్టి దోషం వున్న విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి నలుగురు విద్యార్థులకు దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించి వారికి త్వరలో కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కళ్ల జోళ్లతో కంటి చూపు కాపాడుకోవడానికి శ్రద్ధ చూపాలని కోరారు. విద్యార్థులు కంటి దోషం ఏమైనా ఉన్నట్లు అనిపిస్తే తక్షణమే నేత్రపరీక్షలు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే మందులు, కళ్ళజోలు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ వేణుగోపాలరావు నేత్ర పరీక్షలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఎల్‌హెచ్‌పి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని గొరడ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి వారికి త్వరలో కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కళ్ల జోళ్లతో కంటి చూపు కాపాడుకోవడానికి శ్రద్ధ చూపాలని జిల్లా అంధత్వ నివారణాధికారి జీరు నగేష్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ సన్యాసమ్మ నేత్ర పరీక్షలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఎల్‌హెచ్‌పి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాలకొండలో కుండపోత వర్షం

పాలకొండ : పట్టణంలో గురువారం సాయంత్రం సుమారు గంట పాటు కుండపోతు వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడ్డంతో ప్రజలు ఆనందం చెందారు. వాగులు, వంకలు పొంగి, పొర్లాయి.

20 లీటర్లు సారా పట్టివేత

సీతంపేట : మండలంలోని ఈత మానుగూడ సమీపాన సవర బాలిమ్మ నుంచి 20 లీటర్లు సారాను ఎస్సై వై అమ్మనరావు గురువారం పట్టుకున్నారు. కేసు నమోదు చేసి బాలిమ్మను రిమాండ్‌కు తరలించారు. హెచ్చరించారు.

పలు గ్రామాల్లో 'సుపరిపాలన తొలి అడుగు'

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని రస్తాకుంటుబాయిలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో గురువారం కూటమి ప్రభుత్వం తలపెట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, గ్రామానికి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు గూర్చి ప్రజలకు వివరించి వారి సమస్యలు, గ్రామానికి కావాల్సిన సౌకర్యాలు గూర్చి తెలుసుకుని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చి సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, నాయకులు సుభేష్ చంద్ర పండా, బలగ రామకృష్ణ, సాయి, గంగులు, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం చినబుడ్డిడి, అంకవరం గ్రామాల్లో సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జోగి భుజింగరావు, అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి సురేష్, తెలుగు రైతు అధ్యక్షులు శ్రీరామ్మూర్తి నాయుడు, ఒట్టిగెడ్డ చైర్మన్ సత్యంనాయుడు, నాయకులు కర్రి సోములు, సొసైటీ అధ్యక్షులు పల్లా రాంబాబు ఉన్నారు.

పాచిపెంట : మండలంలోని గురువునాయుడుపేట, రాయిగుడ్డివలస, తాడూరు పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్ అన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం పరుగులు తీస్తుందని, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు తమ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, నాయకులు కె.సురేష్, చల్లా కనక, మతల బలరాం, కొత్తల పోలినాయుడు, పూసర్ల నర్సింగరావు, పాంచాలి బలరాం, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : గురువినాయుడుపేటలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

స్మార్ట్ మీటర్లతో అదనపు భారం ఉండదు

ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యుత్ స్మార్ట్ మీటర్ల వినియోగం వల్ల ఎలాంటి అదనపు భారం వినియోగదారులపై పడదని, వాటిపై అపోహలు అవసరం లేదని ఎపిఈపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.మల్లికార్జునరావు అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు ఛార్జీల భారం ఉండదని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను మరింతగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందని తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు 2021లో ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపిందన్నారు. ఎపిఇఆర్‌సి నిర్ణయించిన టారిఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని తెలిపారు. బిల్లు వివరాలను నేరుగా వినియోగదారుని మొబైల్‌కు చేర వేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారుడికి స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు సంబంధించిన సందేహాలు- సూచనలు నివృత్తి కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912కు సంప్రదించవచ్చునని ఎస్‌ఇ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఇఇ (ఆపరేషన్) కె. గోపాలరావు నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఇ

నిధుల్లేవు..నిర్వహణ ఎలా?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పంచాయతీల్లో నిధుల్లేక అభివృద్ధి పనులు చేయలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, నిధుల లేమి కొరతతో అత్యవసరమైన పనులు కూడా చేయలేక అధ్వానస్థితిలో పంచాయతీల మనుగడ కొనసాగుతుందని జియమ్మవలస మండలం పెదబుడ్డిడి సర్పంచ్ సీమల సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా తమ పంచాయతీకి నిధుల లేమి వెంటాడుతున్నా గ్రామంలో తాగునీరు నిర్వహణలో భాగంగా మోటారు పదేపదే మరమ్మతులకు గురవుతుండడంతో వాటి స్థానంలో కొత్త మోటారును, బోరును తన సొంత డబ్బులతో వేయించి తాగునీటిని నిరాటంకంగా అందిస్తువస్తున్నామని తెలిపారు. అలాగే కాలువల్లో పూడికలు తీయడానికి, వీధి దీపాల నిర్వహణకు నిధులు లేమి ఏర్పడడంతో కూడా సొంత డబ్బులు వెచ్చించి పనులు చేయించినట్టు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు రోగాల బారిన పడకూడదనే చెత్త సేకరిస్తున్న కార్మికులతో పనిచేయించుకున్నప్పటికి నిధుల లేమితో వారికి సకాలంలో జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. నెలల తరబడి జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని వారు తమ వద్ద వాపోతున్నారని ఆమె అన్నారు. కావున ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయతీల నిర్వహణకు కనీసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులైనా విడుదల చేసి గ్రామ పంచాయతీల నిర్వహణకు దోహదపడాలని ఆమె డిమాండ్ చేశారు.

లక్ష్మీపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదంకలాం పరిధిలో గల లక్ష్మీ పురంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయి సిబ్బందితో ఇంటింటికీ తిరిగి లార్వా గుర్తించడానికి జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణతో ఫీవరల్ సర్వే చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్, వైరల్ జ్వరాలకు పారిశు ధ్యమే ప్రధానాస్త్రమని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. డిఎంఒ ఆదేశాల మేరకు గురువారం పెదంకలాం పిహెచ్‌సి పరిధిలో గల లక్ష్మీపురంలో జ్వరాల పరిస్థితిని పరిశీలించడానికి ఎఎంఒ, హెచ్ ఎస్ జయగౌడు లార్వా సర్వే చేసి రిపోర్టును సమర్పించాలని సూచించారు. ఇంటి పరిసరాలు పొడిగా ఉన్నప్పుడే దోమల వృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం జ్వరాలతో బాధపడుతున్న బాధితులను పరామర్శించి వారిలో ముగ్గురికి రక్త నమూనాలను సేకరించి పరీక్ష కోసం విజయనగరం పంపించారు. ఇవి వైరల్ జ్వరాలని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్‌హెచ్ పి.హరిప్రియ, ఎఎన్ఎం లక్ష్మి, ఆరోగ్య కార్యకర్త ప్రసాద్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యాధికారులు

కేరళలో కోన యువకుడు ఆత్మహత్య

మక్కువ : మండలంలోని కోన గ్రామానికి చెందిన మడక గోవర్ధనరావు(29) కేరళలోని కాసరగోడ్ జిల్లా కేంద్రంలో గురువారం ఉరి వేసుకుని మృతి చెందాడు. గోవర్ధనరావు అక్కడ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మృతికి గల కారణాలు తెలీదు. ఆయన తల్లిదండ్రులు రామకృష్ణ, చిన్నమ్మలు, సోదరుడు ఉన్నారు.

ఎఎన్ఎంలను నియమించాలని మోకాళ్ల పై నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ఎఎన్ఎంలను నియమించాలని కోరుతూ స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన దీక్షలు నాలుగో రోజుకు చేరాయి.గురువారం మోకాళ్లపై నిలబడి గతంలో పని చేసిన గిరి ఆరోగ్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి గణేష్, చందు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్ల సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు ఆరిక చంద్ర శేఖర్, హెల్త్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏకలవ్య, ఎపి రెసిడెసియల్, కెజిబివి, జ్యోతిరావు పూలే వంటి పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గిరిజన వసతి గృహాల్లో ఎఎన్ఎంలను ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. గిరిజన మంత్రి మొదటి సంతకానికి విలువిచ్చి తక్షణమే ఎఎన్ఎంలను నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను డిమాండ్ చేశారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఎఎన్ఎంలు

వ్యాధుల నివారణపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకోవాలని వైద్యాధికారి ఎ.మానస సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలను తరచుగా సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకొస్తే అక్కడ వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి, వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ప్రతి నెలా 9న నిర్వహించనున్న పిఎంఎంఎస్‌ఎ కార్యక్రమానికి గర్భిణీలను తనిఖీలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఇందిరా, లలిత కుమారి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన

సీతానగరం : మండలంలోని బూర్జ పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణ ఎంపిడిఒ ఎంఎస్‌ఎల్‌ఎన్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లే బుట్ట బుట్ట ద్వారా సప్త సేకరణ చేసి తడి, పొడి చెత్తలను వేరు చేయాలన్నారు. అలాగే చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి, దాని ద్వారా ఆర్థిక వనరుగా మార్చుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను పరిశీలించి అక్కడ వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ కలిపి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, సర్పంచ్ ఆర్.దాసు, క్రాస్ మిత్రులు పాల్గొన్నారు.